
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

1

మంగళవారం 3 జూన్ 2025



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్, సీపీ



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్, ఎమ్మెల్యేలు, సీపీ

మా నినాదం తెలంగాణ రైజింగ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

- జిల్లాలో 7626 స్వయం సహాయక సంఘాలకు రూ. 785.66 కోట్ల రుణాలు
- మహాలక్ష్మితో మహిళలకు రూ. 158.58 కోట్ల లబ్ది
- 77,726 మంది రైతులకు రూ. 605.71 కోట్ల రుణమాఫీ
- తొలి విడతలో 11,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి

కరీంనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌తో, అదే నినాదంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సోమవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలుగా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను రూపొందించామని అన్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను చేపట్టిందని ఆయన చెప్పారు.

● మహిళలకు ఆర్థిక చేయూత

జిల్లాలోని 7,626 స్వయం సహాయక సంఘాలకు 785.66 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామన్నారు. 7,999 మంది మహిళలకు 66.18 కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను ఇచ్చామన్నారు. మహిళల ఉపాధి కల్పనకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ యాసంగిలో స్వయం సహాయక సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 156 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామన్నారు. మహాలక్ష్మి పథకంతో జిల్లా మహిళలకు 158.58 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో సబ్సిడీ సిలిండర్లకు 16.44 కోట్ల రూపాయలను ప్రభుత్వం భరించిందని చెప్పారు.

● యువతకు ఉద్యోగావకాశాలు

జిల్లాలో డీఎస్సీ ద్వారా 221 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారని, అలాగే వివిధ రకాల పోటీ పరీక్షల్లో జిల్లాకు చెందిన చాలామంది అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. అన్ని సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో జిల్లాలోని మానకొండూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో 273 మంది యువతను లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. జిల్లాలో రుణమాఫీ పథకం కింద 77,726 మంది రైతులకు 605.71 కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేశామన్నారు.

● రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు

రైతు భరోసా పథకం ద్వారా యాసంగి సీజన్‌లో 1,65,850 మంది రైతులకు 132.13 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. వానాకాలం సీజన్ కోసం 30,403 మెట్రిక్ టన్నుల ఎరువులు, సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో భూ భారతిని పకడ్బందీగా అమలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 328 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3,08,683 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేశామని, ధాన్యం విక్రయించిన 51,965 మంది రైతులకు 716.12 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో 65,949 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు కోసం 46,423 దరఖాస్తులు రాగా ఆయా కార్డులలో 59,034 సభ్యులను నమోదు చేసి బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 77,083 మంది దరఖాస్తు చేసుకున్నారని, మొదటి దశలో 11,575 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు.

● పేదల చికిత్సకు రాజీవ్ ఆరోగ్య శ్రీ

రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 7,843 మందికి 22.33 కోట్ల విలువ చేసే శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించామన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే 1,64,519 మంది వినియోగదారులకు 74.34 కోట్ల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న అందరికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.



అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



హాజరైన ప్రజాప్రతినిధులు

● రైతులకు విత్తనాల పంపిణీ

కరీంనగర్ రూరల్/భగత్‌నగర్: ప్రొ ఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రూపొందిం చిన విత్తనాలను మంత్రి శ్రీధర్ బాబు ఆదర్శ రైతులకు అందజేశారు. నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, బొమ్మకల్, ఆర పల్లి, వల్లంపహాడ్, నగునూర్ గ్రామాలకు చెందిన ఆదర్శ రైతులను ఎంపిక చేసి ఒక్కో రైతుకు 10 కిలోల వరి, పెసర విత్తనాలను మంత్రి అందజేశారు.

● అమరులకు ఘన నివాళి

కరీంనగర్ అర్బన్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అమరులను నివాళులర్పించడం వారి త్యాగానికి మనం ఇచ్చే గొప్ప గౌరవం అన్నారు.

● అమరుల కుటుంబసభ్యులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ అమర వీరుల కుటుంబాల వారిని మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో పెద్ది కనకవ్వ (కోటిపల్లి), ఎనుకొండ సుగుణ (కొత్తపల్లి), తీర్థాలు పరమేశ్వర్ (కరీంపేట్), బూరుగు రాజయ్య (చిగురుమామిడి), తాటికొండ వినోద (వీణవంక), బిచ్చ భారతమ్మ (వెలిచాల), గవ్వ ప్రమీల (ఎలగందుల), వై సుభాష్ (తిరుమలనగర్), రెడ్డి రాజేశ్వరి (కన్నాపూర్), సుదగోని నిర్మల (చెంజెర్ల), బొల్లవరం భాస్కర్‌రావు (రామగిరి) ఉన్నారు.

● ఎంపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం



కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎంపీ కార్యాలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్, కాంగ్రెస్‌పాలనతో తెలంగాణ దివాళా తీసిందన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసినా రాష్ట్ర ప్రజల బతుకులు మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగులు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ఆశలను అడియాసలు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి శంకర్‌పాల్గొన్నారు.

పోలీసులకు ఉత్కృష్ట సేవా పతకాలు..

ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ఉత్కృష్ట సేవా పతకాలు, అతి ఉత్కృష్ట సేవా పతకాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రదానం చేశారు. సీసీఆర్‌బీ ఏసీపీ జి విజయ్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి సదాచారి, మానకొండూర్ హెడ్ కానిస్టేబుల్ కె వెంకటరమణారెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు ఎ సంపత్ కుమార్, ఎస్ రామకృష్ణ, కరీంనగర్ టు టౌన్ హెడ్ కానిస్టేబుల్ మొగిలి మల్లయ్య, సీఆర్ఆర్‌బీ కానిస్టేబుల్ ఎన్ రాజ్‌కిరణ్, ట్రాఫిక్ కానిస్టేబుల్ పి రవీందర్, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ఎం శ్రీనివాస్, సీఎస్‌బీ కానిస్టేబుల్ మహ్మద్ మోబిన్ ఖాన్‌లు ఉత్కృష్ట సేవా పతకాలను అందుకున్నారు. రిటైర్డ్ ఏఎస్ఐ ఎన్ జయరాములు, ఏఆర్ ఎస్ఐలు ఎస్ లక్ష్మీనారాయణ, ఎంఎ కబీరుద్దీన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి మల్లారెడ్డి, కరీంనగర్ టు టౌన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ భాస్కర్‌రెడ్డి, ఇల్లందకుంట రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ బి లక్ష్మారెడ్డి, గన్నేరువరం హెడ్ కానిస్టేబుల్ దేవేందర్, కరీంనగర్ టుటౌన్ రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ పి రవీందర్‌రెడ్డి, మహిళా ఠాణా రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ వి లింగారెడ్డి, గంగాధర హెడ్ కానిస్టేబుల్ అగ్గాది శేఖర్, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ వి రవీందర్ అతి ఉత్కృష్ట సేవా పతకాలను మంత్రి చేతులమీదుగా అందుకున్నారు.



మంత్రి శ్రీధర్‌బాబు నుంచి పురస్కారం అందుకుంటున్న ఏసీపీ విజయ్ కుమార్



హెడ్ కానిస్టేబుల్ సదాచారి



ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎ సంపత్‌కుమార్



ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్ రామకృష్ణ



కానిస్టేబుల్ మొగిలి మల్లయ్య



కానిస్టేబుల్ రాజ్‌కిరణ్



కానిస్టేబుల్ రవీందర్



కానిస్టేబుల్ ఎం శ్రీనివాస్



సీఎస్‌బీ కానిస్టేబుల్ మోబిన్ ఖాన్



ఏఎస్ఐ ఎం జయరాములు(రిటైర్డ్)



ఆర్ఎస్ఐ లక్ష్మీనారాయణ




ఏఆర్ ఎస్ఐ ఎంఏ కబీరుద్దీన్



హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ భాస్కర్ రెడ్డి




హెడ్ కానిస్టేబుల్ పి లక్ష్మారెడ్డి(రిటైర్డ్)



హెడ్ కానిస్టేబుల్ అగ్గాది శేఖర్



హెడ్ కానిస్టేబుల్ పి రవీందర్ రెడ్డి(రిటైర్డ్)



కానిస్టేబుల్ బి రవీందర్



కర్రసాము ప్రదర్శిస్తున్న బాలభవన్ విద్యార్థులు

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కరీంనగర్ కల్చరల్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో బాల భవన్ చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు





బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

నేడు విత్తన మహోత్సవం

భగత్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం (క్వాలిటీ సీడ్ ఎట్ ఎవ్రీ విలేజ్) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన మొక్కజొన్న, కంది, పెసర, నువ్వుల విత్తనాలను అందుబాటులో ఉంచాన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మూడున్నర నెలలపాటు 'సమగ్ర ఆరోగ్య ప్రచారం'



జెండా ఊపి మొబైల్ వ్యానును ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఆరోగ్య ప్రచారం (ఇంటిగ్రేటెడ్ హెల్త్ కాంపెయిన్) కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి సెప్టెంబరు 15 వరకు మూడున్నర నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఇందులో హెచ్ ఐవీ, సిఫిలిస్ టెస్టింగ్, క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, షుగర్, హైబీపీకి సంబంధించిన పరీక్షలు, వైరల్ హెపటైటిస్‌లైన హెపటైటిస్-బి, హెపటైటిస్-సీ, హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్‌లో సమగ్ర ఆరోగ్య ప్రచారానికి సంబంధించిన హెల్త్ క్యాంపును అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజిదా, పీవోడీటీ డాక్టర్ ఉమాశ్రీ, ఎంసిహెచ్‌పీవో డాక్టర్ సనాజవేరియా, డెమో రాజగోపాల్, డీపీఎం స్వామి, సురేందర్, మొబైల్ ఐసీటీసీ టీమ, ఎన్‌జీవో పద్మపాని, లింక్ వర్కర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వయో వృద్ధులకు గుర్తింపు..

సీనియర్ సిటిజన్ కార్డు



చొప్పదండి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల గుర్తింపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్ కార్డులను అందజేస్తోంది. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఈ గుర్తింపు కార్డు అందుబాటులోకి రాగా, అనేరకాల ప్రభుత్వ పథకాలు, ప్రయాణ రాయితీలు, ప్రయోజనాలు ఈ కార్డు ద్వారా పొందవచ్చు. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్ కార్డుల అర్హత, ఉపయోగాల గురించి కథనం.

● సీనియర్ సిటిజన్ కార్డు ప్రయోజనాలు..

- బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలకు ఈకార్డు ఉపయోగపడుతుంది.
- భారతీయ రైల్వేలో సీనియర్ సిటిజన్స్‌కు టికెట్ ధరపై రాయితీలను ఈ కార్డు ద్వారా పొందవచ్చు.
- కొన్ని రాష్ట్రాల్లో ఆర్టీసీ బస్సుల్లో తగ్గింపు ధరలో ప్రయాణాలను కల్పిస్తారు.
- బ్యాంకుల్లో, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీని అందజేస్తారు.
- ఇన్‌కంటాక్స్‌లో పన్ను మినహాయింపు పొందవచ్చు. పింఛన్ పొందవచ్చు.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక కౌంటర్లు, వైద్య పరీక్షలపై రాయితీలు పొందవచ్చు.
- రైల్వే స్టేషన్లలో, విమానాశ్రయాల్లో ప్రత్యేక సౌకర్యాలు ఉంటాయి.

● కార్డుకు అర్హత..

- కనీస వయస్సు 60సంవత్సరాలు నిండి ఉండి భారత పౌరులై ఉండాలి.

● దరఖాస్తు విధానం..

- tgseniorcitizens.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలి.
- ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, చిరునామా కోసం(రేషన్‌కార్డు, కరెంట్ బిల్) లాంటివి పొందుపరచాలి. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.
- రిఫరెన్స్ నంబర్ ద్వారా కార్డు వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు.
- దరఖాస్తుచేసిన 7నుంచి 21రోజుల్లో కార్డు అందుబాటులోకి వస్తుంది.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సైకిల్ వినియోగం ఆరోగ్యాన్ని ఇవ్వడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. కొంతకాలం బైక్‌ల వాడకం ఎక్కువై సైకిళ్లవైపు ఎవరూ చూడడం లేదు. సైకిల్ అంటే పిల్లలు నడపాలని భావిస్తారు. సైకిల్ వాడకంతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఏటా జూన్ 3న సైక్లింగ్ దినోత్సవాన్ని జరుపుకోవాలని 2018లో నిర్ణయించింది. పలు దేశాల విన్నపంపై సైక్లింగ్ డేగా నిర్వహించాలని తీర్మానించింది. దీర్ఘాయువు, బహుముఖ ప్రజ్ఞ, పర్యావరణ పరిశుభ్రత, ఆరోగ్యాన్ని పెంపొందించడం సైక్లింగ్ ముఖ్య ఉద్దేశం. శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో సైక్లింగ్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది.



● సైక్లింగ్‌తో లాభాలు...

సైక్లింగ్‌తో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బరువు తగ్గుతుంది. కండరాలను నిర్మించడానికి, కొవ్వును దహించడానికి సహాయపడుతుంది. గంటసేపు సైకిల్ తొక్కితే 300 కేలరీల ఖర్చు అవుతాయని నిపుణులు చెబుతున్నారు. శారీరక శ్రమను పెంచడం, కేన్సర్, మధుమేహం వంటి వ్యాధులను తగ్గిస్తుంది. వాయు శబ్ద కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యాన్ని అందించడంతోపాటు పర్యావరణ హితానికి సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుంది.

రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది

- అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘం చైర్మన్



సైక్లింగ్ రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్ ర్యాలీ నిర్వహిస్తున్నాం. జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో అనేక మందికి సైక్లింగ్‌లో శిక్షణను అందించాం. జిల్లాలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలను నిర్వహించాం. జిల్లాతోపాటు రాష్ట్రంలో సైక్లింగ్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి


తిరుమలేష్(ఫైల్)

కోల్‌సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని రాజేష్ టాకీస్ వద్ద ఉన్న ఓ గోల్డ్‌లోన్స్ సైన్ బోర్డును గతనెల28న బిగిస్తుండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడిన హన్మకొండ మచిలి బజార్‌కు చెందిన తిరుమలేష్(52) అనే కార్మికుడు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెంది నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. బిల్డింగ్ గోడకు సైన్‌బోర్డును బిగిస్తుండగా తిరుమలేష్‌కు షాక్ తగిలి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలు కాగా శరీరం కాలిపోయింది. దీంతో అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడు తిరుమలేష్ సోదరుడు పాండురంగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం..

● చికిత్స పొందుతూ మృతి

ఇల్లందకుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పక్కింటి వారు దూషించారని మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన కొత్తూరి సమ్మయ్య(60)కు కొంతకాలంగా తనఇంటి పక్కవారితో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం సమ్మయ్య గోడ నిర్మాణం కొరకు సలాకా కట్టిస్తుండగా, పక్కింటికి చెందిన గంగారపు ప్రమీల, గంగారపు తిరుపతమ్మ, గంగారపు స్వర్ణలత ఇష్టానుసారంగా దూషించారు. దీంతో సమ్మయ్య తీవ్రమనస్తాపానికి గురైన సమ్మయ్య అదేరోజు తన వ్యవసాయపొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య కొత్తూరి ఐలమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సదయ్య తెలిపారు.

యువకుడి అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రహమత్‌పుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ షాహీద్(18) అనే యువకుడు సోమవారం అదృశ్యం అయ్యాడు. షాహీద్ తన ఇంటి నుంచి మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గొల్లపల్లిశివారు వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ బోనగిరి చిరంజీవిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో రైతు

● రూ.97,195 కొల్లగొట్టిన వైనం

జగిత్యాల క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్‌నేరగాళ్ల వలలో పడి ఓ రైతు మోసపోయాడు. సారంగాపూర్ మండలకేంద్రానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనేరైతు జిల్లాకేంద్రంలోని పురాణీపేటలో నివాసం ఉంటున్నాడు. బ్యాంకు అధికారి అని పేర్కొంటూ శ్రీనివాసరెడ్డికి ఫోన్‌చేసి క్రెడిట్‌కార్డు కాలం ముగిసిందని నమ్మించాడు. దీంతో రైతు తన బ్యాంకు వివరాలు తెలపడంతో సైబర్ నేరగాళ్లు రూ.97,195 కొల్లగొట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకరి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తీగలగుట్టపల్లిలోని చంద్రపురికాలనీలో తనహోటల్ పరిసరాల్లో ప్రొజెక్టర్‌ద్వారా లైవ్‌మ్యాచ్‌ను చూపిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడిన హనుమాన్ నగర్‌కు చెందిన చొప్పరి దిలీప్‌కుమార్‌ను తహసీల్దార్ ఎదుట హాజరు పరచి, లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేశామని సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జీపీ ఉద్యోగికి తీవ్రగాయాలు

మానకొండూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గ్రామపంచాయతీ ఉద్యోగికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన రామగిరి రాజు(37) గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి తాగు నీరందించే విద్యుత్‌మోటార్ చెడిపోగా మరమ్మతుల కోసం తన మోటార్ సైకిల్‌పై సోమవారం కరీంనగర్‌కు తీసుకుపోతున్నాడు. మండలకేంద్రంలోని చెరువుకట్ట సమీపంలో హుజురాబాద్ నుంచి కరీంనగర్‌కు వెలుతున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలు కాగా లారీ డ్రైవర్ పరారయ్యాడు. రాజుని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల శివారులోని రెండో బైపాస్ రోడ్డు సమీపంలో సోమవారం బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో అన్నారం గ్రామానికి చెందిన యువకుడు నితిన్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లిలోని ఓ వైన్స్‌లో పనిచేసే నితిన్‌కుమార్ రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్ ఢీకొట్టాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత



సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న ఆరుగురికి సీఇఐఆర్ పోర్టల్ ద్వారా వెతికిపట్టుకొని సోమవారం అందజేసినట్లు కరీంనగర్ త్రీ టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు అధైర్యపడకుండా ఫోన్ ఈఎంఈఐ నంబరు, ఆధార్ నంబరుతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, తప్పకుండా ఫోన్‌లు వెతికి పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు.

పేకాట మోజులో గొలుసు దొంగగా..

● మహిళ మెడలోంచి పుస్తెలతాడును అపహరించిన డిగ్రీ విద్యార్థి

● అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సుల్తానాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేకాట మోజులో డిగ్రీ విద్యార్థి అప్పుల పాలై దొంగగా మారాడు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్లా రహదారిలో మామిడి పండ్లు అమ్ముతున్న ఓ మహిళ మెడలోని పుస్తెల తాడును దొంగలించి పోలీసులకు అడ్డంగా దొరికి జైలు పాలయ్యాడు ఓ డిగ్రీ విద్యార్థి. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. గట్టేపల్లి శివారులోని ఓ మామిడి తోటను ఏలేని శ్రీనివాస్ లీజుకు తీసుకున్నాడు. తోటలోని మామిడి పండ్లను శ్రీనివాస్ చెల్లి రామినేని రమ్య గతనెల 28వ తేదీన తోట సమీపంలో మధ్యాహ్నం సమయంలో విక్రయిస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కాల్వ రాజు(21) అనేడిగ్రీ చదువుతున్న యువకుడు అటుగా తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఒంటరిగా ఉన్న మహిళను గమనించాడు. మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్నట్లుగా నటించి మహిళ మామిడి పండ్లు తూకం వేస్తున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును అపహరించి ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. రాజు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ పేకాట ఆడి దాదాపు లక్ష రూపాయల వరకు అప్పులపాలయ్యాడు. గతంలో పెద్దపల్లిలో సైతం ఓ మహిళ మెడలో రెండు తులాల బంగారు చైనును దొంగలించాడు. రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుల్స్ రమేష్, రాజ్‌కుమార్, అరుణ్ కుమార్, వేణు, కాల్వ శ్రీరాంపూర్ కానిస్టేబుల్ సదానందం, పొత్కపల్లి ఏఎస్‌ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుల్ కిషన్, బృందంగా ఏర్పడి సీసీ కెమెరాల సహాయంతో నిందితుడి కోసం గాలించారు. ఆదివారం కోమండ్లపల్లి శివారులో సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కాలువ రాజు అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగలించిన పుస్తెల తాడును కరీంనగర్‌లో విక్రయించేందుకు వెళుతున్నట్లుగా ఒప్పుకోవడంతో అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగం పేరిట మోసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం నౌకరీ డాట్‌కాంలో బయోడాటాను అప్‌లోడ్ చేసిన తప్పట్ల సతీష్ అనే యువకుడు మోసానికి గురై రూ.54 వేలు పోగొట్టుకున్నాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బహదూర్‌ఖాన్ పేట్‌కు చెందిన తప్పట్ల సతీష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మరో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ నౌకరీడాట్‌కాంలో తన బయోడాటాను అప్‌లోడ్ చేశాడు. మే 28న ఒక వ్యక్తి ఫోన్ చేసి విర్తుషా కంపెనీలో ఉద్యోగం ఉందని, సాప్ గ్లోబల్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. ఆ సర్టిఫికెట్ పొందాలంటే పరీక్ష రాసేందుకు రూ.22 వేలు ఫీజు చెల్లించాలని, క్యూఆర్ కోడ్ పంపించాడు. నిజమని నమ్మిన సతీష్ రూ.22 వేలు పంపించాడు. స్లాట్ దొరకలేదని మరోసారి బుకింగ్‌కు రూ.54 వేల ఫీజుంటుందని, ఆ డబ్బులు పంపించాలని చెప్పగా మళ్లీ 32 వేలు పంపించాడు. ఆ తరువాత ఆ వ్యక్తికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కొద్దిసేపటి తరువాత స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన సతీష్ సోమవారం కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగునూర్‌లో గుప్తనిధుల వేట

● తవ్వకాలకు యత్నం ● క్షుద్ర పూజల కలకలం

కరీంనగర్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలంలోని నగునూర్‌లో గుప్తనిధుల కోసం వేటసాగుతోంది. గ్రామంలోని పురాతన రామలింగాల దేవాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకానికి ప్రయత్నించారు. సోమవారం సాయంత్రం కొంత మంది గ్రామ యువకులు అటువైపు వెళ్లారు. అక్కడ రెండు కార్లు, ఎక్సకావేటర్లు, ట్రాక్టర్‌లు కనిపించాయి. అనుమానంతో దగ్గరికి వెళ్తుండగా అక్కడున్నవారు పరారయ్యారు. ఆ ప్రాంతంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. కొన్ని రోజులుగా ఇక్కడ క్షుద్ర పూజలు చేస్తున్నా ఎవరూ పసిగట్టలేక పోయారు. గ్రామస్థులు వస్తున్నారనే సమాచారంతో ఎక్స్‌కావేటర్‌తోపాటు రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలతో పరారయ్యారని తెలిపారు. గతంలోనూ గుడిలోనే ఆంజనేయ స్వామికి బంధనం వేసి గుప్త నిధుల కోసం ప్రయత్నించిన దుండగులకు నిరాశ మిగిలింది. అంతేకాకుండా సమీపంలో ఉన్న నంది విగ్రహాన్ని ధ్వంసం చేసే సమయంలో పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం


జీవన్ రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటలో భార్యభర్తల మధ్య మనస్పర్థలతో భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. రేణికుంట గ్రామానికి చెందిన నల్లాల జీవన్ రెడ్డి(37)కి 10 సంవత్సరాల క్రితందీపతో వివాహం జరిగింది. వీరికి విశ్వాన్స్ రెడ్డి, వేదాన్స్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు రావడంతో సంవత్సరం నుంచి ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురైన జీవన్‌రెడ్డి రేణికుంటలో తన ఇంటిలో సోమవారం ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్ఎండీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారంలో నష్టంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టంతో జక్కం సాయిసందీప్(39) అనే వ్యక్తి ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... సాయిసందీప్ భార్య గీత,ఇద్దరు పిల్లలతోకలిసి వావిలాలపల్లిలో నివాసం ఉంటున్నారు. గీత ఒకబ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా సాయి సందీప్ వ్యాపారం చేసి నష్టపోయాడు. అప్పటినుంచి ఒత్తిడికిలోనవగా కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. శనివారం భార్యను పుట్టింటికి వెళ్లేందుకు గుంటూరు బస్సు ఎక్కించాడు. అనంతరం ఇంటికి వచ్చిన సాయిసందీప్ ఆదివారం ఉదయం భార్యకు ఫోన్‌చేసి విరేచనాలు అవుతున్నట్లు చెప్పాడు. బంధువులు సాయిసందీప్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. సాయిసందీప్ పురుగుల మందు తాగినట్లు వైద్యులు నిర్ధారించారని, మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి వృద్ధుడి మృతి

ఎలిగేడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంపల్లి పోచయ్య(67) ఆదివారం ఈతకు వెళ్లి వ్యవసాయ బావిలో మునిగి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో తన మనమనికి ఈత నేర్పేందుకు గ్రామశివారులో ఉన్న వ్యవసాయబావి వద్దకు వెళ్లారు. మొదటగా పోచయ్య బావిలోకి దిగి ఈతకొడుతూ ఊపిరాడక నీటిలో మునిగిపోయాడు. అతడు కనిపించకపోవడంతో బావిపైఉన్న అతడి మనవడు కేకలువేయడంతో అందరూ బావివద్దకు వచ్చారు. విషయం జూలపల్లి పోలీసులకు తెలపడంతో గల్లంతైన పోచయ్యను బయటకు తీసేందుకు విద్యుత్ మోటర్లు పెట్టి నీటిని తోడి ఆదివారం అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తజనం

● రాజన్న సేవలో లక్షకు పైగా భక్తులు ● స్వామి వారి దర్శనానికి 6 గంటల సమయం

వేములవాడ కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హర హర మహదేవా సంభో శంకరా.. అంటూ భక్తులు నినాదాలతో వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం మారుమోగింది. భక్తులు ఒక లక్షకుపైగా వేములవాడకు తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం రాత్రి శైవక్షేత్రానికి తరలివచ్చిన భక్తులు సోమవారం తెల్లవారు జాము నుంచే రాజన్నఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో కల్యాణ కట్టలో రద్దీనెలకొంది. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో ఆరు గంటలు నిరీక్షించినట్లు తెలిపారు. ఆరు గంటల తరువాత ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని బ్రేక్ దర్శనం క్యూలైన్‌ను నిరంతరం కొనసాగించారు. భీమేశ్వర, నగరేశ్వర, బద్ది పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పీఆర్వోలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు త్వరతగతిన కదిలేలా చర్యలు తీసుకున్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న దేవదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్

రాజన్న సేవలో దేవదాయశాఖ కమిషనర్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్రదేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావ్ దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆలయానికి కుటుంబసమేతంగా వచ్చిన కమిషనర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ఎంతోఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్న ప్రత్యేకపూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శ్రీస్వామి వారి శేషవస్త్రంతో సన్మానించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఎవరో కొత్త కింగ్?



రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఒకటా.. రెండా గత 17 ఏళ్లుగా ఒక్కసారైనా ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవాలని ఆ రెండు జట్లు ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న విరాట్ కోహ్లీ కెరీర్‌లోనైతే అదో పెద్ద వెలితి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును తన నాయకత్వంలో చాన్నాళ్లు నడిపించినా చాంపియన్‌ను చేయలేక పోయాడు. కానీ 18వ సీజన్‌లో ఆ అద్భుతాన్ని సాధించేందుకు ఆర్‌సీబీ మరో విజయం దూరంలోనే ఉంది. ఇక గతంలో పంజాబ్ కింగ్స్‌పై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేకపోయినా.. ప్రస్తుతం సీన్ మారింది. శ్రేయాస్ అయ్యర్ ఆ జట్టును కదం తొక్కిస్తున్నాడు. టేబుల్ టాపర్‌గా నిలపడమే కాకుండా తుది పోరుకు కూడా చేర్చాడు. ఇక ఈ రెండు టాప్-2 జట్ల మధ్య ఆసక్తికరపోరులో ఎవరు గెలిచినా తొలి టైటిల్‌తో పండుగ చేసుకుంటారు.

తొలి టైటిల్ వేటలో బెంగళూరు X పంజాబ్

నేడు ఐపీఎల్ -18 ఫైనల్

అహ్మదాబాద్: ప్రపంచ క్రికెట్‌లో అతి భారీ టీ20 లీగ్ అయిన ఐపీఎల్ ఆఖరి అంకానికి చేరింది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు (మంగళవారం) జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- పంజాబ్ కింగ్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే లీగ్ ముగియాల్సి ఉన్నా.. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఆర్‌సీబీ తుది పోరులో తలపడడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016ల్లో టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా రన్నరప్‌గానే నిలిచింది. 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరు జట్టు అభిమానులు ప్రతీసారి హోరెత్తిస్తుంటారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ ఈసారి అదిరే ప్రదర్శనతో జట్టు తుదిపోరుకు చేరి అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా విరాట్ అభిమానులు నెంబర్ 18 జెర్సీలతో స్టేడియంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు బెంగళూరులో హడావిడి మామూలుగా లేదు. రెస్టో బార్స్, పబ్స్‌లతో పాటు భారీ జెయింట్స్ స్ర్కీన్లపై ఫైనల్‌ను తిలకించేందుకు ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. మరోవైపు క్వాలిఫయర్1లో ఆర్‌సీబీ చేతిలోనే చిత్తుగా ఓడిన పంజాబ్ కింగ్స్ తిరిగి తుది పోరులోనూ అదే జట్టును ఢీకొనాల్సి వచ్చింది. ఆదివారం ఇదే మైదానంలో ముంబైని చిత్తు చేసిన అనుభవంతో ఈసారి బెంగళూరుకు గట్టి పంచ్ ఇవ్వాలనుకుంటోంది. 2014లో ఒక్కసారి మాత్రమే పంజాబ్ ఫైనల్లో అడుగుపెట్టింది.



ప్రతీకారంతో పంజాబ్

టేబుల్ టాపర్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ క్వాలిఫయర్1లో ఎదురైన పరాభవంతో ఒక్కసారిగా డీలా పడింది. ఆర్‌సీబీ ధాటికి కేవలం 101 పరుగులకే పరిమితం కావడంతో షాక్‌కు గురైంది. కానీ అలాంటి స్థితి నుంచి వెంటనే తేరుకుని, ఐదు సార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫయర్ 2లో మట్టి కరిపించిన విధానం అదుర్స్. కెప్టెన్ శ్రేయాస్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించగా, 11 ఏళ్ల తర్వాత జట్టు ఫైనల్‌కు చేరింది. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయాస్‌పై.. ఇప్పుడు పంజాబ్‌ను గెలిపించే బాధ్యత ఉంది. తన రూ.26.75 కోట్ల ధరకు 603 పరుగులతో న్యాయం చేస్తున్నాడు. అతడితో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినిస్ ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నారు. అయితే పేసర్ జాన్సెన్ లేకపోవడంతో వీరి బౌలింగ్ కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బ్యాటింగ్ పిచ్‌పై ముంబైని మరీ భారీ స్కోరు చేయనీయకుండా కట్టడి చేయగలిగారు. అయితే పేసర్ అర్ష్‌దీప్ మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే గాయం తర్వాత ఆడిన స్పిన్నర్ చాహల్ సైతం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. ఏదేమైనా ఈ ఆఖరి పోరులో తమ లోపాలను సరిచేసుకుంటూ ఆర్‌సీబీపై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో పంజాబ్ ఉంది.

జోరు సాగాలని..

ఆర్సీబీ ప్రధాన ఆకర్షణ విరాట్ కోహ్లీ అనడంలో సందేహం లేదు. ఎప్పటి మాదిరే ఈ సీజన్‌లోనూ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో రాణిస్తున్నాడు. 614 పరుగులతో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా చూసుకుంటున్నాడు. ఇక ఈ స్టేడియంలోనూ, పంజాబ్‌పై అతడికి మెరుగైన రికార్డు ఉండడం జట్టుకు లాభించేదే. అలాగే మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ రాణిస్తుండడం సానుకూలాంశం. అయితే కెప్టెన్ రజత్ పటీదార్ మాత్రం ఇటీవలి మ్యాచ్‌ల్లో నిరాశపర్చాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఫినిషర్ టిమ్ డేవిడ్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బౌలింగ్‌లో పేసర్ హాజెల్‌వుడ్ ఇప్పటికే 21 వికెట్లతో జట్టు విజయాల్లో పాలుపంచుకుంటున్నాడు. ఇతర పేసర్లు యష్ దయాల్, తుషార, భువనేశ్వర్ సైతం ప్రభావం చూపుతున్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే చాంపియన్ కావడం సాధ్యమే..

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: సాల్ట్, విరాట్, మయాంక్, రజత్ పటీదార్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, క్రునాల్, భువనేశ్వర్, యష్ దయాల్, హాజెల్‌వుడ్.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ (కెప్టెన్), నేహల్, శశాంక్, స్టొయినిస్, ఒమర్జాయ్, జేమిసన్, అర్ష్‌దీప్, చాహల్.

పిచ్

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. క్వాలిఫయర్2లో ఇరు జట్లూ 200+ స్కోర్లు సాధించాయి. ఇక్కడ మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నా.. చివరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుతంగా ఛేదించింది. దీంతో ఫైనల్లో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

వర్షం పడి రద్దయితే..?

ఫైనల్‌కు కూడా వర్షంతో ముప్పు పొంచి ఉంది. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండనుందట. అహ్మదాబాద్, సమీప ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. ఫైనల్‌కు రిజర్వ్ డే ఉన్నందున బుధవారం జరుగుతుంది. అప్పుడు కూడా వర్షంతో వీలు కాకపోతే లీగ్ దశలో టేబుల్ టాపర్ (పంజాబ్) జట్టును విజేతగా ప్రకటిస్తారు.

తటస్థ వేదికగా కొలంబో

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్

దుబాయ్: హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికలను ఐసీసీ ఆదివారం ప్రకటించింది. టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. తటస్థ వేదికగా శ్రీలంకలోని కొలంబోను ఎంపిక చేశారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్ నిర్వహించే ఐసీసీ ఈవెంట్లలో కూడా తమ మ్యాచ్‌లను తటస్థ వేదికపైనే ఆడే విధంగా పాక్ షరతు విధించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే వరల్డ్‌కప్ కోసం బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంతోపాటు కొలంబోను వేదికలుగా ఐసీసీ ఎంపిక చేసింది. సెప్టెంబరు 30న ఆరంభ మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. అయితే, ప్రత్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. అక్టోబరు 29న తొలి సెమీస్‌కు గువాహటి లేదా కొలంబో, 30న జరిగే రెండో సెమీస్ బెంగళూరు వేదిక నిర్ణయించారు. నవంబరు 2న జరిగే ఫైనల్ ఫైట్‌కు బెంగళూరు లేదా కొలంబోలో నిర్వహించనున్నారు. భారత్‌తోపాటు డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఆడనున్నాయి.

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వాయిదా..

మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను వాయిదా వేసినట్టు ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) తెలిపింది. వాస్తవంగా ఈ నెల 6 నుంచి శ్రీలంకలో టోర్నీ జరగాల్సి ఉంది. అయితే, వాతావరణంలో తీవ్ర మార్పులతోపాటు లంక ప్రజల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో లంక బోర్డు రాసిన లేఖ ఆధారంగా టోర్నీని వాయిదా వేస్తూ ఏసీసీ నిర్ణయం తీసుకొంది. త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఇండో-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సెప్టెంబరులో జరగాల్సిన పురుషుల ఆసియా కప్ టీ20 టోర్నీ కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం.

శ్రేయాస్, హార్దిక్‌కు భారీ జరిమానా

అహ్మదాబాద్: క్వాలిఫయర్-2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్-ముంబై కెప్టెన్లపై భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌పై రూ.24 లక్షల జరిమానా విధించగా.. మిగిలిన పంజాబ్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో రూ.6 లక్షల కోత విధించారు. ఇక ముంబై జట్టు మూడోసారి స్లోఓవర్ రేట్‌కు పాల్పడడంతో కెప్టెన్ హార్దిక్‌పై ఏకంగా రూ.30 లక్షలు, ఆటగాళ్లపై రూ.12 లక్షల జరిమానా పడింది.

ప్రతీకారం తీర్చుకున్నాడు..

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

'క్లాసికల్'లో నార్వే దిగ్గజంపై భారత జీఎంకు తొలి విజయం

స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్..వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. తద్వారా క్లాసికల్ గేమ్‌లో..సమకాలీన చెస్ దిగ్గజం కార్ల్‌సన్‌పై గుకేష్ తొలిసారి విజయం సాధించాడు. గుకేష్ చేతిలో ఓడిపోయాననే అసహనంతో బోర్డుపై కార్ల్‌సన్ ప్రతాపం చూపాడు. ఆదివారం రాత్రి జరిగిన ఆరో గేమ్‌లో తెల్లపావులతో తలపడిన 19 ఏళ్ల గుకేష్ 62 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాడు. నల్లపావులతో ఆడినా మ్యాచ్‌లో సింహభాగం కార్ల్‌సనే ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే సరైన ఎత్తులతో ప్రత్యర్థిని ఎదుర్కొన్న గుకేష్ గేమ్ సుదీర్ఘంగా కొనసాగేలా చేశాడు. ఈక్రమంలో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకున్న భారత జీఎం ప్రత్యర్థిపై సంచలన విజయం అందుకున్నాడు. టోర్నమెంట్ తొలి రౌండ్‌లో మాగ్నస్ చేతిలో చవిచూసిన ఓటమికి గుకేష్ బదులు తీర్చుకున్నాడు. ఆరో రౌండ్ గెలుపుతో మొత్తం 8.5 పాయింట్లతో గుకేష్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి అర్మగడాన్ టైబ్రేకర్‌లో చైనా జీఎం వీ ఈపై నెగ్గాడు. దాంతో మొత్తం 7.5 పాయింట్లతో హికారు నకమురాతో కలిసి అర్జున్ నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్ మాస్టర్ వైశాలీ చేతిలో టైబ్రేకర్‌లో కోనేరు హంపి పరాజయం చవిచూసింది. అయితే మొత్తం 9.5 పాయింట్లతో ముజిచుక్‌తో కలిసి హంపి అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది.





తప్పు చేసి.. సారీ చెప్పి..

గుకేష్ చేతిలో ఓటమితో కార్ల్‌సన్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఈక్రమంలో అతడు టేబుల్‌పై బలంగా బాదాడు. దాంతో బోర్డుపై ఉన్న పావులు చెల్లాచెదురయ్యాయి. ఆపై గుకేష్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి సారీ చెప్పిన కార్ల్‌సన్ సీటులోంచి లేచాడు. తప్పు తెలుసుకొని తిరిగి వచ్చి టేబుల్‌పై చెల్లాచెదురైన పావులను సర్దాడు. మరోవైపు కార్ల్‌సన్‌పై విజయాన్ని జీర్ణించుకొనేందుకు గుకేష్‌కు కొంత సమయం పట్టింది. ఈక్రమంలో కార్ల్‌సన్ రూమ్ నుంచి వెళుతూ గుకేష్‌కు మరోసారి సారీ చెప్పి వెన్ను తట్టడం అందర్నీ ఆకర్షించింది.

ప్రధాని అభినందన

గుకేష్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. 'చెస్‌లో అత్యుత్తమ ఆటగాడిపై విజయం సాధించినందుకు అభినందన. నార్వే చెస్ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపొందడం గుకేష్ అద్భుత నైపుణ్యాలకు అతడి అంకితభావానికి అద్దం పడుతుంది' అని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మెరుపు వీరుడి వీడ్కోలు

వన్డేలకు మ్యాక్స్‌వెల్ గుడ్ బై

టీ20లలో కొనసాగుతానని ప్రకటన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్ కప్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. వన్డేలు ఆడేందుకు తన శరీరం సహకరించడంలేదని, అయినా ఈ ఫార్మాట్‌లో తాను కొనసాగితే స్వార్థపరుడినే అవుతానని చెప్పుకొచ్చాడు. మెరుపు బ్యాటింగ్‌కు మారుపేరైన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్ ఆస్ట్రేలియాకు 149 వన్డేలలో ప్రాతినిధ్యం వహించాడు. ఇక..భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్ఘానిస్థాన్‌పై వాంఖడే స్టేడియంలో మ్యాక్సీ ఆడిన ఇన్నింగ్స్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో గొప్ప వాటిలో ఒకటిగా నిలుస్తుంది. 292 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆసీస్ జట్టు 91/7 స్కోరుతో ఓటమి అంచున నిలిచింది. అలాంటి పరిస్థితులలో అత్యంత ఒత్తిడిని అధిగమిస్తూ, అదిరే ఎండలో ఒంట్లోని శక్తంతా హరించుకుపోయి బ్యాటింగ్ చేయడమే కష్టమైన దశలో కేవలం 128 బంతుల్లో ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు దంచుతూ 201 పరుగులు చేసి జట్టును విజయపథాన నిలిపాడు. ఈ ఇన్నింగ్స్‌ను వన్డే చరిత్రలో నభూతోగా పండితులు అభివర్ణించారు. ఆ విజయం ఇచ్చిన స్ఫూర్తితో ఆపై ఆస్ట్రేలియా జట్టు వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. వన్డేలలో మ్యాక్స్‌వెల్ 126 సగటు వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రీ రస్సెల్ తర్వాత రెండో అత్యధికం కావడం విశేషం.

మ్యాక్స్‌వెల్ వన్డే కెరీర్ ఇలా...: మ్యాచ్‌లు-149; పరుగులు-3990; అత్యధిక స్కోరు-201 నాటౌట్; సెంచరీలు-4; హాఫ్ సెంచరీలు-23

అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (33) అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతేడాది జనవరిలోనే టెస్టులకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఫ్రాంచైజీ క్రికెట్ వ్యవహారాలను సమన్వయం చేసుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పాడు. ఏడేళ్ల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన క్లాసెన్.. వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ ఆడనున్నాడు. 'నా కెరీర్, కుటుంబ భవిష్యత్ కోసం ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా. కఠిన నిర్ణయమే అయినా.. ప్రశాంతంగా ఉంద'ని క్లాసెన్ తెలిపాడు. ఏప్రిల్‌లో ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో క్లాసెన్ పేరు లేకపోవడంతోనే అతడు రిటైర్మెంట్‌పై ఊహాగానాలు చెలరేగాయి. 2018 ఫిబ్రవరిలో స్వదేశంలో భారత్‌తో సిరీస్‌లో వన్డే, టీ20లు అరంగేట్రం చేసిన క్లాసెన్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పవర్ హిట్టర్‌గా ఎదిగాడు.

పెగులకు ఝలక్



బోయిస్సన్

● క్వార్టర్స్‌కు గాఫ్, జొకో, జ్వెరెవ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ లోయిస్ బోయిస్సన్ సంచలనం సృష్టించింది. మూడో సీడ్ జెస్సికా పెగులను ఓడించిన బోయిస్సన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. రెండో సీడ్ కోకో గాఫ్, నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మిర్రా ఆండ్రీవ కూడా రౌండ్-8లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 21 ఏళ్ల లోయిస్ బోయిస్సన్ (ఫ్రాన్స్) 3-6, 6-4, 6-4తో పెగుల (అమెరికా)కు షాకిచ్చింది. రెండో సీడ్ గాఫ్ 6-0, 7-5తో అలెగ్జాండ్రోవాపై, ఆండ్రీవ 6-3, 7-5తో డారియా కసట్‌కినా (ఆస్ట్రేలియా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ 6-3, 7-5తో హేలీ బాప్టిస్ట్‌పై గెలిచి ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6-2, 6-3, 6-2తో కామెరూన్ నోరి (బ్రిటన్)పై వరుససెట్లలో నెగ్గాడు. కాగా, జ్వెరెవ్‌కు వాకోవర్ లభించింది. టాలన్ గ్రీక్‌స్పూర్‌తో పోరులో 6-4, 3-0తో జ్వెరెవ్ (జర్మనీ) ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు.

కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్
- వర్చువల్ విధానంలో నిడమనూరు కోర్టు భవనం ప్రారంభం

నిడమనూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఏర్పడుతుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఇందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు దోహదం చేయాలని కోరారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో రూ.5.50కోట్ల నిధులతో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ సుధ, జస్టిస్ సుజన, జస్టిస్ వినోద్‌కుమార్‌ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. జనాభా పెరుగుతుండటంతో కేసులు కూడా పెరుగుతున్నాయని, దానికి అనుగుణంగా కోర్టుల ఏర్పాటు కూడా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కువ వాయిదాలు తీసుకోకుండా కేసులను త్వరితగతిన ముగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. హైకోర్టు పోర్టు పోలియో న్యాయమూర్తి వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిడమనూరు కోర్టు పరిధిలో కేసులు ఎక్కువగా ఉన్నందున అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు సంపూర్ణ ఆనంద్, వేణు, నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పవన్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య పాల్గొన్నారు..

తెలంగాణ ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైలది కీలకపాత్ర

ఎన్నారై అంటే.. 'నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా'

- పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా మాకు తెలంగాణే ఫస్ట్
- ఓట్లలో వెనకబడ్డామేమో కానీ, తెలంగాణను ప్రేమించడంలో కాదు
- డల్లాస్‌లో తెలంగాణ ఆవిర్భావ, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసీయుల పాత్ర ఎనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైల పాత్ర అద్వితీయమని కొనియాడారు. 'ఎన్నారై అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్ కాదు.. నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఎన్నారైల పాత్ర ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుందన్నారు. అమెరికాలో నివసిస్తున్న ఆడబిడ్డలు ఏనాడూ బతుకమ్మను మర్చిపోలేదని, బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని కూడా మర్చిపోలేదని అభినందించారు. అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన కేటీఆర్.. కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, అదే సమయంలో జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ పాలనలో కేవలం పదేళ్లలోనే దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగిందని గుర్తుచేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణను అద్భుత అవకాశాల అక్షయపాత్రగా, దేశానికే ఆర్థిక చోదక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని చెప్పారు. ట్రంప్ విధానాలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అమెరికాలో లీగల్ సెల్ ఏర్పాటు విద్యార్థులను ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బరువులా కాకుండా బాధ్యతగా, ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నడిపామని చెప్పారు. 2023లో జరిగిన ఎన్నికల్లో ఓట్ల పరంగా వెనకపడి ఉండొచ్చు కానీ, తెలంగాణను ప్రేమించడంలో ఎన్నటికీ వెనకబడమని తెలిపారు. 'పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా కచ్చితంగా మాకు తెలంగాణ ఫస్ట్, ఇండియానే ఫస్ట్' అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ బిడ్డలు బతుకుతెరువు కోసం వలస వెళ్లేవారని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చి తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా టీఎస్ఐపాస్ విధానాన్ని రూపొందించామని, దాంతో 27 వేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని వివరించారు. దేశంలోనే జిల్లాకో మెడికల్, నర్సింగ్ కళాశాల ఉన్న ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దినట్లు కేటీఆర్ వెల్లడించారు.

మెడికల్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

- నైజీరియా నుంచి నేరుగా గోవాకు
- 12 ఏళ్లుగా పేర్లు మార్చి రాకపోకలు
- నైజీరియన్‌ను అరెస్టు చేసిన టీజీ న్యాబ్
- రూ.1.25 కోట్ల మత్తుపదార్థాల స్వాధీనం

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్లుగా వేర్వేరు పేర్లతో మెడికల్ వీసాపై నైజీరియా నుంచి నేరుగా గోవాలో దిగి.. డ్రగ్స్ దందా చేస్తున్న ఘరానా పెడ్లర్‌ను తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) అరెస్టు చేసింది. నైజీరియాకు చెందిన ఇమాన్యుయేల్ బెడియాకో అలియాస్ మాక్స్‌వెల్ అలియాస్ మాక్స్ అనే వ్యక్తి.. రూ.కోట్లలో డ్రగ్స్ దందా చేసి, రూ.60 లక్షల వరకు కమీషన్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసు వివరాలను టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య వెల్లడించారు. మ్యాక్స్ తొలుత 2013లో బెంగళూరులో చికిత్స పేరుతో భారత్‌కు వచ్చాడు. అక్కడి నుంచి గోవాకు వెళ్లి, మరో నైజీరియన్ రోమీతో కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. ఇలా.. 2022 వరకు గోవా, హైదరాబాద్‌తోపాటు.. దేశంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ దందా చేశాడు. ఆ తర్వాత మళ్లీ నైజీరియాకు వెళ్లి.. 2023 తర్వాత రెండుసార్లు మారు పేర్లతో మెడికల్ వీసాపై వచ్చాడు. గోవాలోని రోమీతో కలిసి డ్రగ్స్ దందాను కొనసాగించాడు. హైదరాబాద్‌లో ఇతని కదలికలపై ఉప్పందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు.. పక్కా వ్యూహంతో అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.1.25 కోట్లు విలువ చేసే 550 గ్రాముల కొకైన్, 11 వందల ఎక్సటసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రెడ్‌కార్నర్ నోటీసును జారీ చేసి, నైజీరియాకు డీపోర్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సందీప్ శాండిల్య వివరించారు.

బిజినెస్

కరీంనగర్ ● మంగళవారం 3 జూన్ 2025

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, అల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గొమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి
తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహాకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి
దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి
కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్నాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం ప్రదానం



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాళోజీ పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ నలిమెల భాస్కర్

కరీంనగర్ కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లాకు చెందిన బహుభాషావేత్త, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు కాళోజీ పురస్కారం అందజేశారు. పురస్కారం కింద లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక ప్రదానం చేశారు. గతేడాది సెప్టెంబరు 9న కాళోజీ జయంతి సందర్భంగా వరంగల్‌లో నిర్మించిన కాళోజీ క్షేత్రం ప్రారంభోత్సవంలో సీఎం చేతుల మీదుగా పురస్కారం అందిచాల్సి ఉంది. అప్పుడు వాయిదాపడిన కారణంగా సోమవారం అందించారు. భాస్కర్ అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు కవులు, రచయితలు, కళాకారులు అభినందనలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



సిరిసిల్ల రగుడు జంక్షన్‌లో జరుగుతున్న పనులు

సిరిసిల్ల రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీ ఉండే ప్రాంతం సిరిసిల్లలోని రగుడు జంక్షన్. ఇక్కడ బైపాస్ రోడ్డుతో పాటు, సిరిసిల్ల-కరీంనగర్ రోడ్డు, జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్ ఎస్ తెలంగాణ భవన్ ఉండటంతో నిత్యం ఈ జంక్షన్ నుంచి వాహనాలు ఎక్కువ సంఖ్యలో నడు స్తుంటాయి. సిరిసిల్ల- వేము లవాడ ప్రధాన రహదా రిలో ఉన్న రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయకపోవడంతో వాహనదా రులు ప్రమాదా లకు గురవుతున్నారు. జంక్షన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ కనెక్షన్ తొలగించ డంతో రాత్రి వేళల్లో రోడ్డు సరిగా కనిపించక వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సిరిసిల్ల - వేములవాడతో పాటు సిద్దిపేట, కామారెడ్డి ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ జంక్షన్ నుంచి వాహన దారులు వెళ్తుంటారు.



రగుడు జంక్షన్‌లో ప్రమాదానికి గురైన వాహనం (ఫైల్)

● ముగుస్తున్న అగ్రిమెంట్ గడువు

రగుడు జంక్షన్ అభివృద్ధి పనులకు సిరిసిల్ల మున్సిపాలిటీ నుంచి గత ప్రభుత్వ హయాంలో రూ7.50 కోట్లు కేటాయించారు. అప్పటి మాజీ మంత్రి కేటీఆర్ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అగ్రిమెంట్ గడువు ముగిసిపోతుండడంతో కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. జంక్షన్‌లో వెలుగు కోసం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో చీకటిలో వాహనదారులకు రోడ్డు సరిగా కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి, రాత్రి వేళ ఇటీవల స్కూటీపై వస్తున్న వ్యక్తులకు జంక్షన్‌లో చేపట్టిన నిర్మాణాలు కనిపించకపోవడంతో వేగంగా వచ్చి మధ్యలో నిర్మించిన గోడకు ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కామారెడ్డి నుంచి వేముల వాడ వస్తున్న వాహనాలు జంక్షన్ వద్ద నిర్మాణాలకు ఢీకొని ప్రమాదాలకు గురయ్యాయి. రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు వెలుగక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి

\- శీలం రాజు, సిరిసిల్ల



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని జిల్లా కలెక్టరేట్ వద్ద రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతుండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లకు కనెక్షన్‌లు తొలగించడంతో జంక్షన్ వద్ద నిర్మాణాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని వాహనాదారుల ఇబ్బందులు తొలగించాలి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులకు ర్యాంకులు



జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్స్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు వివిద కేటగిరీల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయనవివరాలు వెల్లడించారు. అజ్మీరా పురుషోత్తం నాయక్-166ర్యాంకు,పీఎన్ సాయిధృవ-557, ఎన్.అనిరుధ్‌సాయి-657, బి.ఆదిత్యా-945, బి.విష్ణు-1203, ఎం.అక్షిత-1224, వి.హృషికేష్-1329, ఆర్.గోవర్ధన్-1506, జె .వామిక-1604, బి.చైత్రవ్‌రాజు-1640, ఇ.శశిలాల్-1899, కె .విరేంద్రప్రసాద్-2120, డి.కార్తీక్‌రెడ్డి-2150, ఎన్. విఘ్నేష్-2293, అభిరామ్-2349, ఎ.శశ్రీప్రీతమ్-2453, ఇ.అంకిత్‌సాయి- 2613, మహ్మద్ అబ్దుల్‌హక్-2766, డి.విశాల్-2917 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. నలుగరు విద్యార్థులు 1000లోపు, 11 మంది విద్యార్థులు 2000లోపు, 19 మంది విద్యార్థులు 3000లోపు ర్యాంకులు సాధించారన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిష కృషి ఇంతటి ఘన విజయానికి తొడ్పడ్డాయన్నారు. ఏటా అల్ఫోర్స్ అందిస్తున్న ఐఐటీ కోచింగ్‌తో ప్రతిష్ఠాత్మక ఐఐటీ కాలేజీల్లో సీటు సాధించే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఐఐటీలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

ఎస్సారార్ కామర్స్ సదస్సు అంతర్జాతీయ జర్నల్ విడుదల



కామర్స్ సదస్సు అంతర్జాతీయ జర్నల్‌ను విడుదల చేస్తున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

గణేశ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వకళాశాల కామర్స్ విభాగం ప్రచురించిన 'ఇంటర్నేషనల్ జర్నల్‌ఆఫ్ కల్చరల్ స్టడీస్‌అండ్‌సోషల్ సైన్సెస్' అనేరెండు ప్రత్యేక సంచికలను ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లోని అస్త్ర కన్వెన్షన్‌లో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యాపార, వాణిజ్యరంగాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిపై పరిశోధన పత్రాలను అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించడం అభినందనీయమని అన్నారు. కరీంనగర్ ఉమ్మడిజిల్లా శాసనసభ్యులు, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపుకలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ నితిన్, టి.రాజయ్య, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

'జై తెలంగాణ' ప్రజల నినాదం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

కరీంనగర్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'జై తెలంగాణ నినాదం' ఏ ఒక్కరీ పేటెంట్ కాదని, తెలంగాణ ప్రజల నినాదమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సోమవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జైతెలంగాణ ఒకపార్టీ నినాదం అనుకుంటే వారి మూర్ఖత్వమన్నారు. స్వతంత్రంగా దర్యాప్తు చేస్తున్న కాళేశ్వరం కమిషన్‌ని రాజకీయంగా విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. కమిషన్ నోటీసులపై ఎమ్మెల్సీ కవిత రాజకీయం చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చింది కాళేశ్వరం దర్యాప్తు కమిషన్ అని, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకాదని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి నడుస్తున్నాయని ఎమ్మెల్సీ కవితే చెప్పారని, కాంగ్రెస్ గతంలో ఇదే చెబితే రెండుపార్టీల నాయకులు హడావుడి చేశారని అన్నారు. ఇప్పుడు కేసీఆర్ కూతురు చెబుతున్న అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో ఇతరపార్టీలకు మనుగడ లేదన్నారు. దేశంలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక,కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని, ఎస్సీవర్గీకరణ చేశామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రూపు-1 నిర్వహిస్తే 10ఏళ్ల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వమే మళ్లీగ్రూపు-1 పరీక్షలు నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ అన్నిరకాల కులాలను గుర్తిస్తుందన్నారు. రాజన్నకోడెల మృతి విషయంలో అధికారులతో మాట్లాడుతున్నామని, వేములవాడ గోశాలలో కోడేల మృతి బాధాకర మన్నారు. కోడెల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కరీంనగర్‌లో ఐటీపార్క్ భవనానికేపరిమితమైందని, పెట్టుబడులకు ఐటీసంస్థలు, ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్‌ఆథరైజ్డ్ చిట్‌ఫండ్‌లు ఎవరు నిర్వహించినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఉమ్మడిజిల్లాలో సూక్ష్మతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

ట్రినిటీ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మెన్ మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈఅడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రభంజనం విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. స్పష్టమైన ప్రణాళిక, మెరుగైన విద్యాబోదన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు ఇంతటి మంచి ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని, జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయి ర్యాంకులు, ఈప్‌సెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లోనూ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తమ కళాశాలలో ఫీజు రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ అడ్వాన్స్‌డ్ లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. త్వరలో విడుదల కానున్న నీట్ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధిస్తారని ఆశాబావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకులు సాధన కేవలం ట్రినిటి కళాశాలకే సాధ్యమని, ఉత్తమ విద్యకు ట్రినిటీ కళాశాలలు మారుపేరని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణపై త్వరలో పవర్ పాయింట్ ప్రదర్శన

- తొలి విడత రూ.76 కోట్ల పనులకు టెండర్లు
- రాజన్న ఆలయాన్ని మూసివేస్తామనే ప్రచారం నమ్మవద్దు
- విస్తరణలో భాగంగా భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న ఆలయ విస్తరణ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణపనులపై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పట్టణ వాసులకు, భక్తులకు, ప్రజలందరికీ అవగాహన కల్పించనున్నట్లు ప్రభుత్వవిప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. వేములవాడ రాజన్నఆలయ విస్తరణ, భీమేశ్వరాలయంలో ఏర్పాట్లపై ఆలయ గెస్ట్‌హౌస్‌లో సోమవారం వీటీడీఏ వైస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, దేవదాయశాఖ కమిషనర్ వెంకట్రావ్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ తొలివిడత రూ.76 కోట్లతో ఆలయ విస్తరణ పనులకు త్వరలో టెండర్లు పిలువ నున్నట్లు తెలిపారు. రాజన్న ఆలయం మూసివేస్తున్నామని వస్తున్న అసత్యపు ప్రచారాన్ని నమ్మవద్దని, స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఆలయంలో పనులు చేపట్టనున్న దృష్ట్యా భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. భీమేశ్వర ఆలయంలో నిత్య కల్యాణం, షెడ్లు, భక్తుల దర్శనం క్యూలైన్‌లు, కోడెమొక్కుల క్యూలైన్, మౌలిక వసతులు వంటి మొత్తం 8 అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. విశాలమైన స్థలం, ఆధునిక సౌకర్యాలతో గోశాలలు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించగా, స్థానికంగా స్థలం గుర్తించాలని చర్చించారు. రాజన్న ఆలయ సమీపంలో కిలోమీటర్ పరిధిలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించవద్దని గతంలో జారీ చేసిన జీవోను 100 మీటర్లకు కుదించాలని చర్చించి సదరు జీవో సవరణ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థపతి వల్లి నాయగన్, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ తదితరులు ఉన్నారు.

కోడెలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి భక్తులు ఎంతో నమ్మకంతో నిజకోడెను సమర్పిస్తున్నారని, అలాంటి కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తిప్పాపూర్ గోశాలలోని కోడెలను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. గోశాలలోని కోడెల పరిస్థితిని చూసి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కోడెలకు పచ్చిగడ్డి ఇవ్వాలని నాణ్యమైన దాణా పెట్టాలని క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు.

నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఆరవతరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను నవోదయ విద్యాలయ సమితి సోమవారం విడుదల చేసిందని ఆమె తెలిపారు. ఈ సంవత్సరం 5వతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, జూలై 29లోగా దరఖాస్తు చేసుకోవాలని, 2025 డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నివసించి ఉండాలని, విద్యార్థులు తప్పనిసరిగా 3,4,5వ తరగతులు గ్రామీణప్రాంతాల్లో చదివిన విద్యార్థులు అర్హులని, 25శాతం సీట్లు అర్బన్ ప్రాంత విద్యార్థులకు, బాలికలకు 33శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని ఆమె తెలిపారు. విద్యార్థులు నవోదయ.జీవోవి.ఎన్ ద్వారా లింక్ చేయ బడిన ఎన్‌వీఎస్ అడ్మిషన్‌పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె కోరారు.

రూ.7500 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7500పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు 11మందిరైతులు 157 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7300 చెల్లించి పత్తికొనుగోళ్ల చేపట్టారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జగిత్యాల క్రీడాకారుల ఎంపిక



పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

జగిత్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనడానికి పట్టణానికి చెందిన సన్ రైస్ తైక్వాండో అకాడమీ ప్లేయర్స్ ఎంపికయ్యారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో జగిత్యాల పట్టణానికి చెందిన సన్ రైస్ తైక్వాండో అకాడెమీ ప్లేయర్స్ 6 మంది పాల్గొని వరుసగా 3 గోల్డ్ మెడల్, 2 సిల్వర్ మెడల్స్, ఒకటి బ్రాంజ్ మోడల్స్‌ను సొంతం చేసుకున్నారు. ప్లేయర్స్ బండి లాస్య ప్రియ, మహేష్, సిరిలు గోల్డ్ మెడల్స్ ప్లేయర్స్ కార్తీక్, విహాలు సిల్వర్ మెడల్స్, గందె సమర్థ్ బ్రాంజ్ మోడల్స్‌ను సాధించడం జరిగింది. ఈ మెడల్స్‌లను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ కురువ శ్రీహరి చేతుల మీదుగా విజేతలు స్వీకరించడం జరిగినదని, అలాగే గోల్డ్ మెడల్ సాధించిన ప్లేయర్స్ జూన్ 23 తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ కి అర్హత సాధించినట్లు సన్ రైస్ తైక్వాండో అకాడెమీ కోచ్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గందె సంతోష్‌కుమార్ తెలిపారు. విజేతలను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తా శ్రీనివాస్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల క్రిష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోల గంగారావు, మాస్టర్లు మణిదీప్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇసుక లారీ

- ఇద్దరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆముదాలపల్లి శివారులో మొలంగూర్-వీణవంక రహదారిలో బైక్‌ను ఇసుక లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం మల్లన్నపల్లెకు చెందిన పోతరవేణి శ్రీనివాస్, గాజుల రాజు ద్విచక్రవాహనంపై మొలంగూర్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వీణవంక వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్, రాజుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బ్లూకోట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లాలో మొదటిరోజు 145 రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఇళ్లు, ఇంటిస్థలాలు తదితర అర్బన్‌ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్ విధానం సోమవారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజు ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్ విధానం ద్వారా ఉమ్మడి జిల్లాలో 145 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. కరీంనగర్ ఉమ్మడిజిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో కలిపి 145డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు.

తిమ్మాపూర్‌లో సమీకృత ఆరోగ్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి సుధా రాజేంద్ర

తిమ్మాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆరోగ్యఉపకేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమీకృత ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అదనపువైద్యాధికారి సుధారాజేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలకు హెచ్ఐవి, కామెర్లు, డెంగ్యూ, మలేరియా, సిఫిలిస్, షుగర్, బిపీపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలవైద్యాధికారులు ప్రణవ్, పుల్లారావు, లింక్‌వర్కర్ మమత, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిని కొడుతున్నాడని.. తండ్రిని కారుతో ఢీకొట్టిన తనయుడు

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

చందుర్తి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వచ్చి తల్లిని చితుకబాదుతున్నాడని, ఆవేశానికి లోనైన తనయుడు తండ్రిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవుని తండా గ్రామపంచాయతీ పరిధిలో జరిగింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం దేవునితండాకు చెందిన జాటోత్ తిరుపతి (43) అనే వ్యక్తి ప్రతిరోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతున్నాడు. సోమవారం మద్యం తాగి వచ్చి భార్య అమీనాతో గొడవ పడడంతో పాటు ఆమెను కొట్టడంతో కుమారుడు రాజేష్‌కు ఫోన్ చేసింది. కుమారుడు కారులో వచ్చి తమ ఇంటి సమీపంలో తల్లితో గొడవపడుతున్న తండ్రిని కారుతో ఢీకొట్టాడు. స్థానికులు వెంటనే తిరుపతిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో వేములవాడలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మర్గమధ్యలో మృతి చెందాడు. మృతుడిపై గతంలో చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య అమీనా, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలానికి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ చోరీ

ముత్తారం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వారం గ్రామ శివారులోని పంట పొలాల వద్ద ఏర్పాటుచేసిన 22కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ చేసి అందులోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని విద్యుత్ శాఖ ఏఈ సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. కాపర్ వైరు విలువ సుమారు 25,000 రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ అధికారుల బాధ్యతల స్వీకరణ

భగత్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా అలువాల శంకరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ రీజియన్‌నుంచి బదిలీపైవచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది కిరణ్, మొగిలి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శంకరయ్య రీజినల్ మేనేజర్ బిరాజుతు, డిప్యూటీరీజినల్ మేనేజర్‌లు భూపతిరెడ్డి, మల్లేశంను మర్యాదపూర్వకంగా కలిశారు.

● జోనల్‌వర్క్‌షాప్ నూతనవర్క్స్ మేనేజర్‌గా ప్రణీత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కరీంనగర్‌జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చొప్పదండిలో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





కరీంనగర్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లేశం

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి జాతీయ జెండా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ జెండా ఎగురవేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి పవన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏవో సుధాకర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఖాళీ చరణ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా జైలులో జూలు సూపరింటెండెంట్ విజయ్ డేని జాతీయ జెండా ఎగురవేశారు.

కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాల యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ప్రశాంత్ నగర్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ జెండా ఆవిష్కరించారు.

కరీంనగర్ క్రైం: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ రమేష్ బాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి జాతీయ జెండా ఎగురవేశారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంజీవరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

భగత్‌నగర్: చింతకుంటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు అనిల్‌కుమార్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కొత్తపల్లి మాజీ ఎంపిపి పిల్ల శ్రీలత, మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కార్పొరేటర్లు గందె మాధవిమహేష్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కుర్ర తిరుపతి, సుదగోని మాధవికృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ), పారడైజ్ పాఠశాలల్లో పాఠశాల చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి జెండాను అవిష్కరించారు.

అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, రీజినల్ మేనేజర్ రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు భూపతిరెడ్డి, మల్లేశం, స్వప్నకుమారి పాల్గొన్నారు.

నగరంలోని పారమిత విద్యాసంస్థల్లో పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు, రాకేష్, రశ్మిత, ప్రాచి, ప్రసాద్, రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, బాలాజీ, ప్రశాంత్, శ్రీకర్, శర్మిష్ట, కవితప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రాచకొండ ప్రభాకర్, కొత్తపల్లిలో బాపూజీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నం సత్యనారాయణగౌడ్ జెండాను ఆవిష్కరించారు.

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘం భవనంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలోని బ్లడ్ బ్యాంకు సెంటర్‌లో సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో బీసీ సెల్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

● అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● మానేరు విద్యాసంస్థల్లో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు.

● బ్లూబెల్ హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్‌రెడ్డి జెండా ఎగురవేశారు.

హుజూరాబాద్/శంకరపట్నం/సైదాపూర్/చిగురువామిడి/చొప్పదండి/ఇల్లందకుంట/రామడుగు/మానకొండూర్/తిమ్మాపూర్/ గంగాధర/ జమ్మికుంట/ గన్నేరువరం/వీణవంక: హుజూరాబాద్ డివిజన్‌లో, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో తెలంగాణ అవతరణ దినోత్స వాన్ని అధికారులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సహకారసంఘాలు, పార్టీ కార్యాల యాలు, గ్రామ పంచాయతీల్లో జాతీయజెండాను ఎగురవేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ర్యాలీలు నిర్వహించారు. చొప్పదండిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నాగరాజు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నవీన్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. హుజూరాబాద్ పట్టణంలోని అమర వీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రావుల రమేష్ పార్టీ జెండా ఎగుర వేశారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

కరీంనగర్ కల్చరల్: అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రమని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు గాజోజు నాగభూషణం అన్నారు. అమర వీరుల స్థూపం వద్ద అమరుల త్యాగాల కవితాగానంలో భాగంగా మాట్లాడారు. సీవీ కుమార్, డాక్టర్ విజయకుమార్, నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, ఖాలిద్, చైతన్య, విజయశ్రీ, రమణయ్య, తిరుపతి, బాలకృష్ణ, మహేందర్, యుగంధర్, ముఖేశ్ పాల్గొన్నారు.



ఎస్‌యూలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న వొడితెల ప్రణవ్



సెయింట్ జార్జ్ పాఠశాలలో..



పారమిత పాఠశాలలో



జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారావు

క్రీడలకు ప్రోత్సాహం



ప్రశంసా పత్రం అందజేస్తున్న కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా ముందుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభమంగళ్ కన్వెన్షన్ హాల్‌లో మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులకు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కన్న కృష్ణ, శ్రీనివాస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, ఏఐవైఎఫ్ నాయకుడు యుగేందర్, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, శారీరక దృఢత్వం పెంపొందుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శ్రీధర్‌బాబు జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో రాణిస్తూ క్రీడారంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వవైభవాన్ని తీసుకురావడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, మానకొండూర్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం,డాక్టర్ సంజయ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్, కార్యదర్శి గుంటపల్లి స్వామి పాల్గొన్నారు.

కడారి రవి మృతి క్రీడారంగానికి తీరని లోటు

కరీంనగర్ స్పోర్ట్స్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుడు కడారి రవి మృతి ఉమ్మడి జిల్లా క్రీడారంగానికి లోటని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలో కడారి రవి భౌతికకాయం వద్ద సోమవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దారని, ఉద్యోగాల్లో, సంస్థల్లో స్థిరపడేందుకు ప్రోత్సహించారని అన్నారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఏఎస్సై మల్లారెడ్డికి సన్మానం

కరీంనగర్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో 36 ఏళ్ల సేవలు అందించి సైదాపూర్ పోలీసు ఠాణాలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్సై మల్లారెడిని కమిషనరేట్ కేంద్రంలో సోమవారం గౌస్ ఆలం సన్మానించారు. ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు, చొప్పదండి ఎస్సై సురేందర్ పాల్గొన్నారు.

ఉప కార్మిక కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉప కార్మిక కమిషనర్‌గా కోల ప్రసాద్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో సహాయ కార్మిక కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై కరీంనగర్‌కు వచ్చారు. సహాయ కార్మిక కమిషనర్ వెంకటరమణ, సహాయ కార్మిక అధికారులు అభినందనలు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఇన్‌చార్జి డీఈవో

కరీంనగర్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరాం మొండయ్య సోమవారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయంలో భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఏసీపీ మాధవి

జమ్మికుంట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని శివాలయం (బొమ్మగలగుడి)లో అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో భక్తు లకు సోమవారం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా హుజూరాబాద్ ఏసీపీ వి మాధవి, సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ హాజరై అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయట్రస్టీ కొండూరి దుర్గాప్రసాద్, జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు భాస్కర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హుజూరాబాద్‌రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలోని శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయ ధ్వజస్తంభ శిఖరయంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ పత్తి క్రిష్ణారెడ్డి ఉన్నారు.

పాఠశాలలకు యూనిఫాం పంపిణీ

గంగాధర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గంగాధర ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఎంఈవో ప్రభాకర్‌రావు యూనిఫాంలు పంపిణీచేశారు. ఈ నెల 12నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నందున 33గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమికోన్నతపాఠశాల, ప్రాథమికపాఠశాలల ప్రధానో పాధ్యాయులకు విద్యార్థుల యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన

గన్నేరువరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట, గుండ్లపల్లి గ్రామాల్లోని రైతువేదికల్లో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే శిక్షణాకార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఏవో కిరణ్మయి, భారతీయ వరిపరిశోధనా సంస్థ ప్రతినిధులు సునీత, శివకుమార్, కేవీకే ప్రతినిధి విజయ్, సేద్య విభాగ శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి

శంకరపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డిని నియమిస్తూ దేవాదాయశాఖ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి, ధర్మకర్తలుగా రామగిరి తిరుమల, ఎడ్ల తిరుపతి, రత్నం, లక్ష్మణ్‌రావు, రవీందర్, తిరుపతి నియామకం కాగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామకపత్రాలను అందజేశారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రామడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతుల ఆదాయన్ని రెట్టింపు చేస్తానని హామీఇచ్చిన నేపథ్యంలో క్షీరాభిషేకం చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కట్ట రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కరీంనగర్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రాజేష్ సోమవారం తెలిపారు. మంగళవారం నాడు దుర్శేడ్‌లో, 4న జూబ్లీనగర్, 5న ఫకీర్‌పేట, 6న చేగుర్తి, 9న చామనపల్లి, 10న ఇరుకుల్ల, 11న వల్లంపహాడ్, 12న ఆరెపల్లి, 13న ఎలబోతారం, 16న చెర్లబూత్కూర్, 17న నగునూర్, 18న తహెర్‌కొండాపూర్, 19న బొమ్మకల్, 20న మొగ్దుంపూర్ గ్రామాల్లో నిర్వహిస్తామని, రైతులు తమ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని కోరారు.

మానకొండూర్: మండలంలో ఈనెల 3న ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, 4న మానకొండూర్, 5న చెంజర్ల, 6న గట్టుదుద్దెనపల్లి, 9న గంగిపల్లి, 10న కొండపల్కల, 11న అన్నారం, 12న వెల్ది, 13న పచ్చునూర్, 16న ఊటూర్, 17న వేగురుపల్లి, లింగాపూర్, 18న కెల్లేడు, 19న మద్దికుంట, వన్నారం, 20న దేవంపల్లి, లలితాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

చొప్పదండి: మండలంలో 3న భూపాలపట్నం, 4న కొలిమికుంట, 5న కోనేరుపల్లి, 9న ఆర్నకొండ, 10న చాకుంట, 11న చిట్యాలపల్లి, 12న రాగంపేట, 13న వెదురుగట్టు, 16న గుమ్లాపూర్, 17న రుక్మాపూర్, 18న కాట్నపల్లి, 19న చొప్పదండిలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.

హుజూరాబాద్: మండలంలో 3న ధర్మారాజుపల్లి, 4న కనుకులగిద్దె, 5న జూపాక, 6న కాట్రపల్లి, 9న కందుగుల, 10న పోతిరెడ్డిపేట, 11న సిర్సపల్లి, 12న సింగాపూర్, 13న తుమ్మనపల్లి, 16న బోర్నపల్లి, 17,18న చెల్పూర్, 19,20న హుజూరాబాద్ కేసీ క్యాంపులోని రైతు వేదికలో ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ కనకయ్య పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

● ఎమ్మెల్యే మేడిపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం

గంగాధర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమమని ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మధురానగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంల చిత్రపటాలకు కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన ఏఎంసీ చైర్మన్ రజిత మాట్లాడుతూ మండలంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బాష్కర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రోమాల రమేష్, దుబ్బాసి బుచ్చయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్ఆర్ విద్యార్థుల జయకేతనం



ఎస్ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి

గణేశ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో కరీంనగర్ ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో జయకేతనం ఎగురవేశారని కళాశాల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. సోమవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు సపవత్ పవన్-204వ ర్యాంకు, మేడ కార్తీక్ 1009, బనావత్ సుమన్1049, బుర్ర మాధవ్ 1471, నీరటి శ్రీచరణ్ జోష్ 1321, గుగులోతు శేఖర్1328, ముదగంటి రుశీశ్వర్ రెడ్డి 2318, దొనకొండ సాయి చందన 3218, దయ్యాల రాజకుమార్ 6519 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. పరీక్షలు ఏవైనా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎస్ఆర్ విద్యార్థులు అద్భుత విజయాలు సాధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈవో, డీజీఎం, జోనల్ ఇన్‌చార్జి అకడమిక్ డీన్స్, ప్రిన్సిపాల్‌లు అభినందనలు తెలిపారు.

వార్డుల పునర్విభజన షెడ్యూల్ విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పాలక సంస్థ వార్డుల పునర్విభజన ప్రక్రియ తుదిదశకు చేరుకున్నది. కరీంనగర్ నగర పాలక సంస్థలో గతంలో 60డివిజన్‌లు ఉండగా, కొత్తగా విలీనగ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీని కలుపుకుని66 డివిజన్లుకానున్నాయి. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి షెడ్యూల్ జారీ చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్, కరీంనగర్‌రూరల్ మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్ గ్రామాలు విలీనమయ్యాయి. కొత్తపల్లి, విలీన గ్రామాలను కలుపుకుని డివిజన్ల సంఖ్య పెరగనుంది. వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం జూన్ 3వ నుంచి షెడ్యూల్‌ను అమలు చేయనున్నది. 3వ తేదీన నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఫీల్డ్ సర్వేతో పాటు, డ్రాఫ్ట్ ప్రపోజల్స్‌ను తయారుచేయనున్నారు. 4న ప్రజలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు నోటీసులు అందించి, ప్రకటనలు జారీ చేయనున్నారు.

5నుంచి 11వరకు ప్రజలతోపాటు, ఎంపీలు, ఎమ్మెలేలు, ఎంపీల సూచనలు, సలహాలు తీసుకోనున్నారు. 12నుంచి 16వరకు వచ్చిన సూచనలు, సలహాలపై విచారణ నిర్వహించనున్నారు. 17, 18తేదీల్లో కలెక్టర్ వద్దకు అప్రూవల్ కోసం పంపిస్తారు. 19న తుది రిపోర్టును డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపించనున్నారు. 20నరిపోర్టును సీడీఎంఏకు పంపించ నున్నారు. 21న వార్డుల పునర్విభజన తుది నోటిఫికేషన్ వెలువడనున్నది.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2కే రన్

హుజూరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయి రూప గార్డెన్ నుంచి ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానం వరకు 2కే రన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాధవి మాట్లాడుతూ స్వచ్ఛ హుజూరాబాద్ తీర్చిదిద్దుటకు పట్టణ ప్రజలందరూ సమష్టిగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం 2కేరన్‌లో మొదటి బహుమతికి రూ.1500, రెండో బహుమతికి రూ.1000 నగదు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ సీఐ కరుణాకర్, హరిప్రసాద్, మున్సిపల్ ఏఈ సాంబరాజు, మేనేజర్ భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్, రషీద్, వాకర్స్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో 2కే రన్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు